అతని పాటల సరదా
చుట్టుపక్కలవాళ్లకి
డబ్బులు ఆదా
ఎలా చేస్తోంది?

# భద్రం మైక్ సర్వీస్

పెనుమాక
దేవానంద్ కథ

''ఏవండోయ్ శ్రీవారూ లేవండి లేవండి కరెంటొచ్చింది'' అంటూ దివాకరాన్నిదాదాపు కుదిపేసింది సిరిచందన.

''ఆ... ఆ లేస్తున్నానోయ్ అసలు నిద్రపట్టి చస్తేగా ప్రత్యేకంగా నిద్ర లేవడానికి'' అంటూ దుప్పటిని ఓ మూలకు విసిరేస్తూ లేచి కూర్చున్నాడు దివాకరం.

నిన్ననే బ్యాంకుకెళ్లి అత్తగారిచ్చిన అతి తక్కువ కట్నంలోంచి ఓ ఏడు వేల రూపాయలు తీసి ''ఫిలిప్స్ పవర్ హౌస్ టేప్ రికార్డర్'' కొన్నాడు. చిన్నప్పటినుంచీ హరిప్రసాద్ చౌరాసియా, బాలమురళీకృష్ణల సంగీతమంటే అతనికి ఎంతో మక్కువ. పైగా అతని భార్యకూడా సినిమాలంటే ఇన్‌ట్రెస్ట్ వుండడంవల్ల ఆ టేప్ రికార్డర్ కొన్నాడు.

తీరా మోసి టేప్ రికార్డర్ తీసుకొచ్చాక, కొబ్బరికాయ కొట్టి ప్రారంభిద్దామని అన్నీ సిద్ధపాటు చేశాక, ప్లే బటన్ నొక్కడానికి సిరిచందన స్విచ్‌మీద వేలు పెట్టిందో లేదో, పవర్‌కట్. అదీ నిన్న జరిగిన సంగతి. రాత్రంతా కరెంట్ లేకుండా ప్రొద్దుట ఏడు గంటలకు దర్శనమిచ్చింది.

''హరిప్రసాద్ చౌరాసియా సంగీతం పెట్టు''

''ఏం కాదు, శుభసంకల్పం క్యాసెట్ పెడదాం, అందులో సీతమ్మ అందాలూ రామయ్య వైనాలూ... అనే, పాట బాగుంటుంది''

''సరే ఏదో ఒకటి పెట్టుతల్లీ టెన్షన్ భరించలేకపోతున్నాను''

నిన్న టేప్ రికార్డర్‌తోపాటు కొన్న శుభసంకల్పం క్యాసెట్ నెమ్మదిగా టేప్‌లో పెట్టి




ఆన్ చేయబోతుండగా... బయోవమంటూ మొదలైంది ఎదురింటి భద్రం టేప్‌రికార్డర్. దాన్ని టేప్ రికార్డర్ అనేకంటే మైక్ అంటే బాగుంటుందేమో. ఎందుకంటే అదెప్పుడూ ఫుల్ సౌండ్‌తోనే పాడుతుంది. అలా వింటేనేగానీ భద్రానికి విన్నట్టు వుండదు.

''అత్తో అత్తమ్మ కూతురో మొత్తంగా సత్తా చూపించమందిరో'' అంటూ దిక్కులు

పిక్కటిల్లేలా వస్తున్న ఆ పాట సౌండ్‌కి చుట్టుపక్కల ఉన్న వాళ్ల ఇంట్లో వస్తువులు కదిలిపోతున్నాయ్!!!

బిక్కమొహాలేసుకుంటూ ఒకరి మొహాలు ఒకరు చూచుకున్నారు. దివాకర్, సిరిచందనలు. దిగాలుగా మంచమ్మీద కూలబడిపోయింది సిరిచందన. చేసేదిలేక రుసరుసలాడుతూ బయటికెళ్లిపోయాడు దివాకరం.

మధ్యాహ్నం రెండు గంటలు కావస్తోంది. భద్రం మైక్ మాత్రం అలా ఫుల్ సౌండ్‌తో పాడుతూనే వుంది.

తమ టేప్‌లో మొదటిసారిగా కాస్త ప్రశాంతంగా పాటలు విందామన్న కోరిక తీరలేదు ఆ నవదంపతులకు. అప్పటికే టేప్ రికార్డర్ గూర్చి ఎక్కువగా ఆలోచించడంమూలాన ఇద్దరికీ బుర్ర హీటెక్కిపోవడంవల్ల నిద్రలోకి జారుకున్నారిద్దరూ.

ముందుగా దివాకరానికి మెలకువ వచ్చింది. తుఫాను వచ్చి వెలసినట్టుంది వాతావరణం. కారణం ఏమిటంటే ఎదురింటి మైక్ తాత్కాలికంగా ఆగి వుండడమే. భార్యను లేపకుండా టేప్ ఆన్‌చేసి ఒక్కసారిగా ఆమెను థ్రిల్ చేద్దామనుకుని నెమ్మదిగా టేప్ రికార్డర్ దగ్గరకెళ్లి; తన భార్యకెంతో ఇష్టమైన శుభసంకల్పం కాసెట్ అందులో పెట్టి ఆన్ చెయ్యబోతుండగా...

''ఈ పేటకు నేనే మేస్త్రీ...'' అంటూ మళ్లీ హోరెత్తించడం మొదలుపెట్టింది భద్రం మైక్. ఏడువేల రూపాయల టేప్ రికార్డర్‌నూ పై అంతస్తునుంచి కిందకు విసిరేద్దామా అన్నంత కోపం వచ్చింది దివాకరానికి.

ఇంక చేసేదిలేక తన టేప్ రికార్డర్ ప్లగ్ పీకేసి టీ తాగుదామని బయటికొచ్చాడు. హోటల్‌లో అతని స్నేహితుడు శ్రీనివాస్ టీ తాగుతూ కనిపించాడు.

''ఏంటి దివాకరం నేను విన్నది నిజమేనా?'' అని దివాకరాన్ని అడిగాడు.

''ఏమిటది?!!'' ప్రశ్నార్థకంగా అతన్ని చూస్తూ అడిగాడు దివాకరం.

అదేనోయ్ నీవు టేప్ రికార్డర్ కొనడం భద్రానికి ఇష్టం లేక రోజూ నిన్ను నీ టేప్ రికార్డర్‌లో పాటలు వినకుండా చేస్తున్నాడట.

''నీకెవరు చెప్పారు?!!'' ప్రశ్నించాడు దివాకరం.

''ఇద్దరు ముగ్గురు దగ్గర విన్నానులే'' అన్నాడు శ్రీనివాస్.

''అదన్నమాట అసలు సంగతి' అనుకుంటూ అక్కడ్నించి వడివడిగా వెళ్లిపోయాడు దివాకరం.

మరుసటిరోజు, ఆదివారం -

''ప్రొద్దుటే నిద్ర లేచేసరికే... చిన్నపాపకేమో చీరకాస్త చిన్నదాయెరా పెద్దపాపకేమో పైటకాస్త పెద్దదాయెరా, చూడలేక చస్తున్నా... వేగలేకపోతున్నా'' అంటూ వీధిని హోరెత్తిం చేస్తున్నాడు భద్రం. కాలకృత్యాలు తీర్చుకుని మార్కెట్‌కని సంచిపట్టుకుని బయటపడ్డాడు దివాకరం.

ఇంతలో హోటల్‌లో టీ తాగుతూ కన్పించాడు, అతని మిత్రుడు శ్రీనివాస్. అతన్ని చూసి నెమ్మదిగా హోటల్‌లోకి వెళ్లాడు దివాకర్. ''ఆ ఏమిటి దివాకరం విషయాలు'' అంటూ పలకరించాడు శ్రీనివాస్. ప్రక్కనే టీ త్రాగుతూ కనిపించాడు భద్రం.

''నువ్విక్కడే వున్నావా మహానుభావా ఆ వచ్చేదేదో ఆ మైక్ కట్టేసి రావచ్చుగదా'' అని

మనసులో గొణుక్కుంటూ పళ్లు పటపటా నూరుకున్నాడు దివాకరం.

భద్రం టేప్ సౌండ్ ఆ హోటల్‌లోకి కూడా వినిపిస్తుంది.

''ఇంతలో శ్రీనివాస్ కల్పించుకుంటూ ''ఆ ఏమిటి దివాకరం నీ టేపరికార్డర్ ఎలా పనిచేస్తోంది? క్రొత్తది అందులోనూ ఫిలిప్స్ బాగానే పనిచేస్తుందిలే'' రేడియోలో అడ్వర్‌టైజ్‌మెంట్ ఇస్తున్నట్లుగా అన్నాడు.

''అదా బాగానే వుందిగానీ ఎవరైనా కొనుక్కుంటారేమో కనుక్కో, అమ్మేయాలనుకుంటున్నాను'' సిగరెట్ పొగ గాల్లోకి వదులుతూ అన్నాడు దివాకరం.

''అదేమిటి దివాకరం ముచ్చటపడి కొనుక్కుని, కనీసం మూన్నాళ్ల ముచ్చటైనా తీరకుండా అమ్మేస్తానంటావేంటి?'' ఫేసులో పెద్ద క్వొచ్చన్ మార్కు పెట్టుకుని అన్నాడు శ్రీనివాస్.

''నా పిచ్చిగానీ నాకు పాటలు వినడానికి లోటేంటయ్యా, మా భద్రం వుండగా! నేను వినాలనుకుంటున్న పాటలన్నీ ఎలాగూ భద్రం టేపరికార్డర్‌లో రోజూ వింటూనే వున్నానుగదా, ఇంకా నాకు టేపు రికార్డర్ ఎందుకు చెప్పూ డబ్బులూ కరెంటు దండగ కాకపోతే అన్నాడు భద్రంవైపు చూస్తూ.

''వింటున్న భద్రానికి వళ్లుమండిపోయింది. వార్నియబ్బ నేనింత కష్టపడి టేపరికార్డర్ కొనుక్కుంటే నా పేరు చెప్పుకుని వీళ్లంతా వింటూ, డబ్బులూ కరెంటూ ఆదా చేసుకుంటారా, ఆ ఖర్చంతా నాకూను, వినేది వీళ్లానా, చూస్తా చూస్తా ఇకనుంచి ఎలా వింటాడో చూస్తా!!'' అని ఒహటే గొణుక్కుంటున్నాడు మనస్సులో పిచ్చిగా!!!

ఎందుకైనా మంచిది మీరు టేప్ రికార్డర్ అమ్మే ముందు మరోసారి ఆలోచించడం మంచిది అని దివాకరానికో సలహా పారేసి అక్కడ్నించి గబగబా వెళ్లిపోయాడు భద్రం.

సాయంత్రం ఆరయిపోతున్నా భద్రం మైక్ మాత్రం వినబడ్డంలేదు. అది చిన్నగా టేప్ రికార్డర్‌లా పనిచేస్తున్నట్టుంది.

తనకీ ఆలోచనివ్వడమేకాకుండా ఈ నాటకంలో తనూ ఓ పాత్ర పోషించి, తను ఈ బారినుండి రక్షించిన శ్రీనివాస్‌కి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ శుభసంకల్పం క్యాసెట్‌కోసం పరుగెత్తాడు దివాకరం. ★

## తండ్రి

''సారీ రాణీ. ఎందుకో నీ కడుపులో బిడ్డకు తండ్రిని నేను కాననిపిస్తోంది. నేను నిన్ను పెళ్లి చేసుకోలేను.'' చెప్పాడు రాజా.

''ఆదేంటి రాజా నువ్వు ఇలాగే అని, మోహన్ ఇలాగే అని, రాజేష్ ఇలాగే అని, కార్తీక్ ఇలాగే అంటే ఇక నేనెవర్ని పెళ్లి చేసుకోవాలి.'' కంగారుగా అంది రాణి.



-వాయిగండ్ల మురళీకృష్ణ (ఒంగోలు)